బొమ్మాండమైన రక్షణ


అడవి జంతువులు చొరబడకుండా వరికుప్ప చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప తీగలు, చీరలు, ప్లాస్టిక్ సంచులు


వందలాది వరికుప్పలకు రక్షణగా అమర్చిన ఇనుప తీగలు, ప్లాస్టిక్ సంచులు

- వరికుప్పలకు వినూత్నంగా రక్షణ
- కుప్పలచుట్టూ బొమ్మలు, చీరలు, పాలిథిన్ సంచుల ఏర్పాటు
- శబ్దాలకు దరిచేరని అడవి జంతువులు

తుని రూరల్: రైతులు విత్తనాలు వేసినప్పటి నుంచి ఫలసాయం చేతికి అందేవరకూ పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటారు. కొన్ని పొలాల్లో పంటలకు, పంట కుప్పలకు పగలు, రాత్రులు కాపలా ఉండలేని పరిస్థితులు ఉంటాయి. కొండలను ఆనుకుని ఉన్న పొలాల్లో అడవి జంతువులు చొరబడి కోతకొచ్చిన, కుప్పలు వేసిన పంటలను, సీజన్‌లో మామిడి, జీడిమామిడి పూతలను ఆహారంగా తినేస్తూ ధ్వంసం చేస్తుంటాయి. కాపలా లేకుడానే పంటల రక్షణకు రైతులు కొత్త ఆలోచనలు చేస్తున్నారు. అడవి జంతువులను బెదర గొట్టేందుకు ప్లాస్టిక్ (పాలిథిన్) సంచులను గాలివాటానికి అమర్చి సహజ సిద్ధంగా శబ్దాలు చేస్తున్నారు. సత్ఫలితాలు ఇస్తుండడంతో కొన్నేళ్లగా ఇదే విధానాన్ని అనుచరిస్తున్నట్టు పలువురు రైతులు తెలిపారు. సబ్ డివిజన్‌లో 48 వేల ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేస్తున్నారు. వీటిలో సుమారు 8 వందల ఎకరాల్లో బొమ్మలు, ప్లాస్టిక్ సంచులు, పాత చీరలు, ఇనుప తీగలను రక్షణగా చుట్టి అడవి జంతువుల రాకను రైతులు అడ్డుకుంటూ పంటలను రక్షించుకుంటున్నారు. నియోజకవర్గంలో కొందరు రైతులు వరికోతలైన వెంటనే నూర్పిడి చేయగా మరికొందరు వరి కుప్పలు వేసి, కుప్పలకు వినూత్నంగా రక్షణ ఏర్పాట్లు చేశారు.

పంటల సంరక్షణ ఇలా..

వరి, పత్తి, కూరగాయల తదితర పంటల కోత సమయంలోనూ, కుప్పల చుట్టూ రైతులు కర్రలను నిలువుగా ఏర్పాటు చేసి వాటికి బొమ్మలు, ప్లాస్టిక్ సంచులు, ఇనుపతీగలు, చీరలను అమర్చారు. గాలికి సంచులు అటుఇటుగా ఎగురుతూ శబ్దాలు చేస్తున్నాయి. ఈ శబ్దాలను అడవి జంతులువు పసిగట్టి మనుషులు సంచరిస్తున్నట్టు భ్రమపడుతూ బెదిరి కొండలు దిగడంలేదు. జంతువులు పంట పొలాల్లోకి చొరబడడం, కుప్పలు ధ్వంసం చేయడం తగ్గిపోయిందని రైతులు తెలిపారు. అలాగే మామిడి, జీడి మామిడి తోటల్లో పూతను తినేందుకు, తాగునీటికి కొండల నుంచి జంతువులు దిగుతుంటాయి. మామిడి, జీడిమామిడి తోటల చుట్టూ రైతులు ఇనుప తీగలను అమర్చుతూ అడవి జంతువులను నిరోధిస్తున్నారు. ఒక్కొక్కసారి ఇనుప తీగలకు అడవి జంతువులు చిక్కుకుని మృత్యువాత పడుతున్నాయి.

ప్లాస్టిక్ సంచులు, ఇనుప తీగలు కట్టాను

మూడు ఎకరాల్లో వరిపైరు వేశాను. సమీపం కొండల నుంచి అడవి పందులు, ఎలుగుబంటి, తదితర జంతువులు వచ్చి పంటలను ధ్వంసం చేయకుండా నిరోధించేందుకు ప్లాస్టిక్ సంచులు కట్టాను. సత్ఫలితం వచ్చింది. పంట కోసి కుప్పలు వేశాను. నూర్పిడి చేసేవరకు అడవి జంతువుల నుంచి రక్షణగా కుప్పలు చుట్టూ ప్లాస్టిక్ సంచులు, ఇనుప తీగలు కట్టాను.

– పదిలం దొరబాబు, రైతు, ఎ.అగ్రహారం

కాపలా కాయలేక నూర్పిడి

రాజుపేటలో ఐదున్నర ఎకరాల భూమి ఉంది. అందులో ఏటా వరి సాగు చేస్తున్నాను. సమీప కొండల నుంచి రాత్రివేళల్లో గుంపులుగా అడవి పందులు వచ్చి పంటలను, వరి కుప్పలను నాశనం చేస్తున్నాయి. కాపలా కాయలేక నాలుగైదేళ్ల నుంచి కోతలు కోసి పనలు ఎండబెట్టి కుప్పలు వేయకుండానే నూర్పుళ్లు చేస్తున్నాను.

– పంపనబోయిన రాజు, రైతు, రాజుపేట

పలు గ్రామాల్లో...

వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో అడవి జంతువుల బెడద ఎక్కువగా ఉంది. తుని మండలంలో చామవరం, హంసవరం, తేటగుంట, ఎస్ఎస్‌వీ నగరం, కొత్త వెలంపేట, ఎ.అగ్రహారం, రాపాక, రాజుపేట, కోటనందూరు మండలంలో ఏఈ చిన్నయ్యపాలెం, అగ్రహారం, పి.కొట్టాం, తొండంగి మండలంలో బెండపూడి, రౌతులపూడి సింగధార, డీజేపురం, ఎస్ఎస్ పట్నం, శంఖవరం మండలంలో అన్నవరం, మండపం, పైడిపాల గ్రామాల రైతులు ఈ పద్ధతులు పాటిస్తున్నారు.

నేడు రత్నగిరిపై రథసప్తమి వేడుకలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శనివారం రథ సప్తమి వేడుకలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. పండితులు ఉదయం 8.30 గంటలకు సత్యదేవుని వార్షిక కల్యాణ వేదిక మీద సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, వివిధ భంగిమల్లో సూర్య నమస్కారాలు చేస్తారన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేస్తారని తెలిపారు.

ఎంఎస్ఓకు ఉత్తమ సేవా పురస్కారం


కలెక్టర్ కృతికా శుక్లా నుంచి అవార్డు అందుకుంటున్న ఎంఎస్ఓ కృష్ణ

జగ్గంపేట: స్థానిక ఎంఎస్ఓ జీఎంఎం కృష్ణ, గోవిందపురం వీఆర్వో ఎం.ధర్మయ్యకు ఉత్తమ సేవా పురస్కారాలు దక్కాయి. కాకినాడలో గురువారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు చేతుల మీదుగా ఎంఎస్ఓ కృష్ణ, వీఆర్వో ధర్మయ్య అవార్డులు అందుకున్నారు.

క్లుప్తంగా

నేడు ఇ.గోకవరంలో గడపగడపకూ..

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఇ.గోకవరం, వేములపాలెం గ్రామాల్లో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎసాస్సార్ సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరీక్షలపై భయం వీడాలి

తుని: పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు భయాన్ని విడనాడాలని బీజేపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు పడాల విశ్వనాథ్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం బీజేపీ తుని పట్టణశాఖ ఆధ్వర్యంలో పరీక్షా పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన దేశవ్యాప్త పిలుపు మేరకు విద్యార్థుల్లో భయాన్ని పాగోట్టెందుకు అవగాహన కల్పిస్తున్నామని విశ్వనాథ్ తెలిపారు. బీజేపీ నాయకులు కాదంబరి రామకృష్ణ, వెలటా ఈశ్వరరావు, ప్రగడ చక్రరావు, పుల్లంరాజు, నారాయణాచార్యులు, ఆనంత శేషగిరి పాల్గొన్నారు.

ఏలేశ్వరం ఎస్సైగా సతీష్



ఏలేశ్వరం: స్థానిక ఎస్సైగా జి.సతీష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్సైగా పని చేసిన విద్యాసాగర్ జగ్గంపేటకు బదిలీ అయ్యారు. తుని టౌన్‌లో పనిచేస్తున్న సతీష్ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సదర్భంగా ఎస్సై సతీష్ మాట్లాడుతూ మండలంలోని శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంచి మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు.

ప్రభుత్వాసుపత్రికి సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ


వైద్యాధికారి శైలజకు ఫ్యాన్లు అందజేస్తున్న దాతలు

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వాసుపత్రికి శుక్రవారం దాత రెండు సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రతినిధి జువ్విన వీర్రాజు, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ బదిరెడ్డి గోవిందు ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన దాత సెల్వరాణి తనభర్త ముత్తుస్వామి జ్ఞాపకార్థం ఆసుపత్రి వైద్యాధికారి శైలజకు ఫ్యాన్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివప్రసాద్, సొసైటీ డైరెక్టర్ సిరిపరపు రాజేష్, బాదం సురేష్, ఎల్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొండరాజులబాబు తీర్థం

ఏలేశ్వరం: రమణయ్యపేటలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొండరాజులబాబు తీర్థమహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారిని వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ అలమండ చలమయ్య, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ బదిరెడ్డి గోవిందు స్వామివారి దర్శించుకున్నారు. ఏజెన్సీకి ముఖ్యద్వారం కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. వచ్చే నెల 16వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నారు.

దళిత సంఘాల ఆందోళన

గోకవరం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జెండా స్తంభం వద్ద అంబేడ్కర్ చిత్రపటం లేకపోవడంపై పలు దళిత సంఘాల నాయకులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. స్థానిక ఠాణా సెంటర్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చిత్రపటం లేకుండా గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందజేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కోటనందూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాలలోని 125 మంది విద్యార్థులకు సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు గర్సింగు దొరబాబు, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి శ్రీను పరీక్ష మెటీరియల్ అందజేశారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని పబ్లిక్ పరీక్షల్లో విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

తుని: స్థానిక విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు భవనంలో శుక్రవారం అలయెన్స్ క్లబ్ ఆఫ్ తుని నూతనం కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అలయెన్సు క్లబ్ (ఇంటర్నేషనల్) విశాఖ అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా కోరుకొండ సత్యనారాయణ, కార్యదర్శిగా పి.సత్యనారాయణ, కోశాధికారిగా దాసరి నూకయ్యశెట్టి, ఉపాధ్యక్షులుగా ఆంజనేయ ప్రసాద్, జీకే నాయుడుతో పాటు పలువురు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎన్నికయ్యారు. వీరితో విశ్వేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

భీష్మ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు


భీష్మ ఏకాదశి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న ఈఓ సత్యనారాయణమూర్తి

అన్నవరం: భీష్మ ఏకాదశి సందర్భంగా వచ్చే నెల 1న రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేయాలని దేవస్థానం ఈఓ ఎస్‌వీ సత్యనారాయణ మూర్తి అధికారులను ఆదేశించారు. భీష్మ ఏకాదశి ఏర్పాట్లపై శుక్రవారం ఆయన దేవస్థానం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భీష్మ ఏకాదశి ముందు రోజు సాయంత్రం నుంచి భక్తులు రత్నగిరికి తరలివస్తారని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, చిన్నారులకు పాలు, బిస్కెట్లు అందించాలన్నారు. ముందు రోజు అర్ధరాత్రి నుంచే సత్యదేవుని వ్రతాలు, స్వామివారి దర్శనానికి ఏర్పాట్లు చేయాలని, ఆరోజు ఉదయం ఎనిమిది గంటల నుంచి భక్తులకు పులిహోర పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రసాదాల విక్రయాలకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఘాట్‌రోడ్‌లో ట్రాఫిక్ జామ్ అవ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఈఈ నూకరత్నం, ఏఈఓలు జగ్గారావు, కృష్ణారావు, భ్రమరాంబ, డీఈలు గుర్రాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి


శంఖవరంలో ఏపీడీ శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న కేజీబీవీ విద్యార్థులు

శంఖవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి బి.శ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అందించే అహర పదార్థాలు, నిర్మాణంలో ఉన్న తరగతి గదులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సిలబస్‌ను వేగంగా పూర్తి చేయాలన్నారు. సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాలను పరిశీలించి విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎస్‌వీ రమణ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణవేణి, కేజీబీవీ ప్రిన్సిపాల్ బాల మణికుమారి, సీఆర్పీలు డి.రాజుబాబు, నాని తదితరులు పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం


వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు అమరేశ్వర ఘనపాఠి, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట శ్రీనివాస్, పరిచారకులు చిట్టిం వాసు, నగేష్, వ్రతపురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కొండ దిగువన తొలిపాంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలో రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

తలుపులమ్మతల్లికి మహాచండీ హోమం

తుని రూరల్: లోవ దేవస్థానంలో కొలువైన తలుపులమ్మ అమ్మవారికి శుక్రవారం మహాచండీ హోమం నిర్వహించారు. వేదపండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి విశేషాలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించినట్టు ఈఓ విశ్వనాథరాజు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- గండేపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం


గండేపల్లిలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గండేపల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గండేపల్లిలో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఎంపీటీసీ మద్దిపట్ల రామకృష్ణ, సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరి మధుకుమార్ తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత మూడేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. స్థానికులు రోడ్లు, డ్రైన్లు, విద్యుత్, వీధి దీపాలు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం మల్లేపల్లి హైస్కూల్‌లోని పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పరిమి మంగతాయారు, సొసైటీ సభ్యులు కేతిన బాబి, మురారి ఉప సర్పంచ్ జాస్తి వసంత్, పార్టీ నాయకులు పరిమి బాబు, సానేపిని చౌదరి, తాళ్లూరి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో ఎరువుల దుకాణాలపై శుక్రవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. ఎరువుల బస్తాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఫిర్యాదు చేయడంతో రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్స్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్.లక్ష్మీనారాయణ, సీఐ రమేష్, పెద్దాపురం లీగల్ మెట్రాలజీ ఏఓ మోహన్, తొండంగి వ్యవసాయాధికారి ఎస్.నరసింహంతో కూడిన బృందం ఎరువుల షాపుల్లో తనిఖీలు నిర్వహించింది. పలు షాపుల్లో రికార్డులు పరిశీలించి నిల్వల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. షాపుల నిర్వాహకులపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు ఏఓ నరసింహం తెలిపారు. వారి వెంట ఏఈఓ కొప్పన దైవ ప్రసాద్, వీఏఏలు ఉన్నారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

ఏలేశ్వరం: ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి.సతీష్ సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ ఎస్.బాపిరాజు ఆధ్వర్యంలో శుక్రవారం రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ప్రమాదాల నివారణపై సిబ్బందికి ఎస్సై సతీష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ డ్రైవింగ్ చేసే ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. డ్రైవర్లు రహదారులు దాటేటప్పుడు, వాహనాలు తప్పించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. తొలుత ఎస్సై సతీష్‌ను డీఎం బాపిరాజు ఘనంగా సత్కరించి మోమెంటో అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

తుని: వాహనాలను నడిపే సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని తుని పట్టణ సీఐ నాగ దుర్గారావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తుని ఆర్టీసీ డిపోలో మేనేజర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగ దుర్గారావు మాట్లాడుతూ డ్రైవర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. డ్రైవింగ్ సమయంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. వాహన వేగం, సిగ్నల్ సిస్టిమ్, కండీషన్, మెడికల్ ఫిట్‌నెస్ తదితర అంశాలను పాటించాలన్నారు. ప్రయాణికులను సురక్షంగా గమ్యస్థానాలకు చేర్చడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆర్టీసీ నాయకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


తునిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 27వ వార్డులో శుక్రవారం కౌన్సిలర్ కలగట్ల ప్రశాంతి ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా ? అని ప్రశ్నించారు. పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలు, చెత్తసేకరణ, కాలువల్లో వ్యర్థాలు తొలగింపు పనులు ఎలా జరుగుతున్నాయని మహిళలను అడిగి తెలుసుకున్నారు. గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రెడ్డి, జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు కన్వీనర్లు పాల్గొన్నారు.

పల్లాకు తెగులుపై అప్రమత్తంగా ఉండాలి


వి.వెంకటాపురంలో మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

శంఖవరం: మినుము, పెసర పంటలను ఆశిస్తున్న పల్లాకు తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని వి.వెంకటాపురంలో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. మినుము పంటలను పరిశీలించారు. మినుము, పెసర పంటల్లో పల్లాకు తెగులు, బూడిద తెగులు, ఆకు ముడత తెగుళ్ల లక్షణాలను గుర్తించి రైతులకు నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ క్రాంతి పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

పశుసంవర్ధకశాఖ జేడీ సూర్య ప్రకాష్

గండేపల్లి: పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాష్ రైతులకు సూచించారు. మండలంలోని గండేపల్లి, మల్లేపల్లి, తాళ్లూరు, తదితర గ్రామాల్లో ఇటీవల లంపీ చర్మవ్యాధి సోకిన లేగ దూడలు మృత్యువాత పడ్డాయి. ఆయా గ్రామాల్లోని లంపీ చర్మవ్యాధి సోకిన పశువులను శుక్రవారం ఆయన పరిశీలించి పశువుల యజమానులతో మాట్లాడారు. పశువులకు సరైన సమయంలో వైద్యం అందించి ఉంటే మృత్యువాతకు గురయ్యేవి కాదన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులకు జ్వరం, శరీరంపై బొబ్బలు వస్తాయన్నారు. మండలంలోని 3333 పశువులు ఉన్నాయని, వాటిలో 2670 పశువులకు టీకాలు వేశామనానరు. రైతులు భయపడాల్సిన పనిలేదని పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీడీ ఆర్.వెంకటేశ్వర్లు, జగ్గంపేట ఏవీహెచ్ ఎస్.సత్యనారాయణ, వైద్యాధికారులు ఎ.సుప్రియ, సోనీ గౌస్యా, సిబ్బంది ఉన్నారు.

'ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన'పై అవగాహన

కోటనందూరు: యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏపీఎం సూర్యకుమారి అధ్యక్షతన బ్యాంకర్లు, లబ్ధిదారులకు ప్రధానమంత్రి ఉద్యోగ కల్పన పథకం (పీఎంఈజీపీ)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులు యూనిట్లు ఏర్పాటు చేసుకొని బ్యాంకుల నుంచి రుణాలు పొందాలన్నారు. బ్యాంకర్లు సైతం ప్రభుత్వ ఆదేశాలను గౌరవిస్తూ అర్హులైన దరఖాస్తుదారులకు రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా జౌళిశాఖ జూనియర్ ఇనస్పెక్టర్ పీటీ శ్రీనివాస్ ఈ పథకం విధి విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రాష్ట్ర వ్యవసాయ సలహామండలి డైరెక్టర్ లంక ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకుడు గర్సింగు దొరబాబు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, డీపీఎం పద్మావతి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

గోకవరం: విద్యార్థినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చైల్డ్ లైన్–1098 జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని వీరలంకపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు శుక్రవారం పలు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ కేఎంవీ రాణి ఆధ్వర్యంలో కోఆర్డినేటర్ శ్రీనివాసరావు విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ సిబ్బంది బి.రాజ్‌కుమార్, జి.క్రాంతిలాల్, మహిళా సంరక్షణ అధికారి నూర్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలి

జగ్గంపేట: స్థానిక మెయిన్ రోడ్డు, బస్టాండ్ సెంటర్లలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తోపుడు బండ్ల వ్యాపారులు సహకరించాలని జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ కోరారు. జగ్గంపేట సెంటర్‌లో శుక్రవారం తోపుడు బండ్ల వ్యాపారులు, కిరాణా షాపు యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని తోపుడు బండ్లను రోడ్లకు ఇరువైపులా ఉన్న మార్జిన్ దాటి పెట్టుకోవాలని సూచించారు. కిరాణా షాపులు వద్ద కొనుగోలుదారుల తమ వాహనాలను ఇష్టానుసారం రోడ్డుపై పెట్టకుండా చూడాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏవీ నగరం పీహెచ్‌సీ డాక్టర్లకు సన్మానం


వైద్యులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

తొండంగి: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించినందుకుగాను ఏవీ నగరం పీహెచ్‌సీకి జిల్లాలో మొదటి ర్యాంకు దక్కింది. దీంతో పీహెచ్‌సీలో సేవలందిస్తున్న వైద్యులు డాక్టర్ పి. రవికుమార్, భారతీలను స్థానికులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, తుని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీ ఆధ్వర్యంలో నాయకులు డాక్టర్లను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వైద్య సేవల్లో పీహెచ్‌సీకి జిల్లాలోనే మొదటి ర్యాంకు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. వైద్యులు రవికుమార్, భారతీలు రోగులకు అందించిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించారని కొనియాడారు. సర్పంచ్ కొయ్యా జగదీశ్వరి, ఎంపీటీసీ యనమల వరహాలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడలో తహసీల్దార్ కార్యాలయం


మద్యం కక్కేయడంతో అధ్వాన్నంగా మారిన తహసీల్దార్ కార్యాలయ పరిసరాలు

కోటనందూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం నిర్లక్ష్యం నీడలో కొట్టుమిట్టాడుతోంది. ఈ కార్యాలయంలో ఎంతమంది సిబ్బంది పని చేస్తున్నారో, ఎవరు ఎప్పుడు వస్తున్నారో, ఎప్పుడు వెళ్లిపోతున్నారో తెలియని దయనీయ పరిస్థితి నెలకొంది. ఇక్కడ తహసీల్దార్ నెలరోజులుగా మెడికల్ లీవ్‌లో ఉండడంతో ఇన్‌చార్జ్‌ల పాలన సాగుతోంది. సిబ్బందిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ సైతం లేకపోవడంతో కార్యాలయ నిర్వహణ అధ్వాన్నంగా మారింది. ఈ కార్యాలయంలో కొంతమంది సిబ్బంది తాగి ఊగుతున్నట్లు కార్యాలయానికొచ్చే ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలకు ధ్రువపత్రాలు జారీ చేయడంలో కూడా తీవ్ర జాప్యం జరుగుతుందని, చేతివాటం కూడా ప్రదర్శిస్తున్నారని మండి పడుతున్నారు. తాజాగా గురువారం రాత్రి కార్యాలయంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మద్యం తాగి కార్యాలయ ఆవరణలో వాంతు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం సిబ్బంది కార్యాలయానికి వచ్చేసరికి మద్యం దుర్వాసన వెదజల్లుతూ భయానక వాతావరణం దర్శనమిచ్చింది. ఈ కార్యాలయానికి నైట్ వాచ్‌మెన్ లేకపోగా కనీసం గేటుకు తాళం కూడా వేయడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయ నిర్వహణ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.